

# స్క్రిప్టులో కథ

కథా నిలయం
5580
శ్రీకాకుళం

''స్క్రిప్టు అంటే'' అన్నది కళ్యాణి.

''నేను ఇంగ్లీషు తెలుగు నిఘంటువునా? ఇంకెవరూ అందలేదా నీకు? పోనీ తెలుగు ఇంగ్లీష్‌పదకోశం చూసుకో'' దగ్గర్లో వున్న పదకోశం కళ్యాణి ముందుకు నెట్టింది రోజీ.

''వెతకటం చాతకాదు. టైమ్ పడుతుంది. మరొకమ్మ గార్ని అడిగితే ''ఆదివాసి '' అని గేలిచేస్తుంది. మరో అర్ధం చెప్పి నవ్వుతుంది. మీ పని అయాకే చెప్పు రోజమ్మా''.

సరోజిని అనే లెక్చరర్ని ఆమె ప్రియమైన స్టూడెంటు, ఆమె నాశ్రయించుకుని వున్న కళ్యాణి, చనువు యేర్పడినప్పటినించీ అలా పిలుస్తున్నది. ప్రపోజ్ చేస్తున్న శ్యామసుందర్, 'సరో! సరోవర్! సరూ! సరుగుడు చెట్టూ!'' అంటూ మొదలెట్టి, తపోభంగం చేయాలని వచ్చిన మేనకలాగా ఆడుతాడు. సరోజిని డాక్టరేట్ తెచ్చుకోవాలని విశ్వామిత్రునిలాగా రిసెర్చిలో మునిగింది. తపస్విని లాగా యేకాగ్రత పాటిస్తున్నది. శ్యామసుందర్ అందగాడు. సరసుడు. లెక్చరరు.

''నానార్ధాలా? ఒకటేనా?'' తలెత్తి అడిగింది.

''నానార్ధాలూ వున్నాయీ? చెప్పండి రాసుకుంటాను''.

''చిత్తుప్రతి, చేతితో వ్రాసిన ప్రింట్ కాని రచన, డైలాగులూ వర్ణనలూ లేని సౌండ్ ట్రాక్‌లాంటి కథ. ఒక నవలని కేవలం ప్రశ్నలూ జవాబుల్లో వ్రాయటం. మతగ్రంధాలనీ స్క్రిప్ట్సు అంటారు''.

''థాంక్స్ రోజమ్మా. ఒక్క వుదాహరణిస్తే విని వెళ్లిపోతా''.

2

'పెళ్లి తంతులో నమ్మకం లేదని మోడరన్ రిఫార్మర్‌లాగా మాట్లాడి, చాలా పెళ్లిళ్లు చేస్తున్నారే మిస్టర్ స్టబ్బారన్!''

''నాకు లేదన్నాను. నా సాయం అడిగినవారికుంటే, వారి నమ్మకాలు వారివి. సమర్ధుడనని అడుగుతారు. సంఘభీతి వున్నదేమో! నాకు లేదు. అంతమందెందుకు సాక్ష్యం? అంత భీతివుంటే బెస్ట్‌మాన్ చాలు'' అన్నాడు హీరో. చిరునవ్వు చిందులేస్తూ వుంటుందతని మొహం మీద.

'' ఏజ్ బార్ అయాక అయితే పిల్లల నాన్సెన్స్ వుండదనీ, పీరియడ్సప్పుడు నిరపాయకరమనీ రఫ్ హ్యూమర్ వాడారు. ఆచరణయ్యేదీ వేళా పాళా లేదు. తిధివార నక్షత్రాల మాట దేముడెరుగు. రాత్రివేళ అహల్యపతి దేవుని గౌతముని పాదాలొత్తుతుంటే గోరు తాకిందట. పతిదేవుడు కస్సుమన్నాడట. అదేదో సంకేతంట. నేను పాదాలు వత్తను గనక నాకు తెలియదు. ఇంద్రుడు కోడైకూస్తే, తెల్లారబోతున్నదని, గౌతముడులేచి నదికి వెళ్లాడట. ఇంద్రుడు మాయాగౌతముడై లోపలదూరి అహల్యను వాటేసుకున్నాడట. ''యేదో పొరపాటున నా చేతి గోరు తాకితే కస్సుమని లేచి సమయం మంచిదిగాదంటివే? ఇపుడెలా వాటేసుకున్నావు యెవరు నువ్వు?'' అని నిలేసింది అహల్య.

''యెన్నాళ్లనించో నీ మీద మనసు నిలుపుకుని మరిచిపోలేని స్వర్గాధిపతిని. భూప్రదక్షిణం చేసి రమ్మనటంలో మోసమూ కిటుకూ తెలియక నేను నిజంగా ఆ పనిచేస్తుంటే, నిన్ను నా దానిని చేసుకోవాలంటే, ఆ పనిచేసి చూపాలని షరతు, గౌతముడు కిటుకు తెలిసికొని, పార్వతీ పరమేశ్వరులకు మొక్కి ప్రదక్షిణలు పూర్తి చేసి, నేను వచ్చేప్పటికి, నిన్ను యెగరవేసుకుపోయాడు'' అన్నాడు.

హీరో బాగా నవ్వాడు '' ఇప్పటికి అహల్య సంక్రందనుల కథ బాగా తెలిసింది. గౌతముడు శపిస్తాడని తెలిసిగూడా సంక్రంధనుడు తనలేడీని యెలా మీటయాడో అనుకునేవాడిని. నీకు బొత్తిగా హ్యూమర్లేదు. డేల్ కార్నేజ్ రచనలు కొనిచ్చి చదవమన్నానే. భార్యా భర్తల మధ్య ప్రేమ సయోధ్య నిఃబడాలంటే, దెప్పవోకు అని రాశాడు. నువేమో నా ఓల్డర్ బ్రదర్ గ్రాండ్ చెయిల్డ్‌కి మాఛ్ ఫిక్స్ చేశాననీ డౌరీ గూడా సప్లై చేశాననీ దెప్పుతున్నావు. ఫూల్. బ్రైడ్‌కి ఫిట్సున్నాయి. అవి వస్తున్నాయని పైకి పొక్కక ముందే మాఛ్ ఫిక్సింగ్

జరగాలన్నాడు మా అబ్బాయి. బ్రైడీజ్ లక్కీ. మా చిన్న అమ్మమ్మ సమయానికి పిల్లనివ్వండి అని రొద మొదలెట్టింది. తన మనమడప్పుడే ఆడపిల్లల వెంటబడుతున్నాడట. నేవలాఫీసరైనాడుట. వాడికి ఆస్తీ బాంక్ బాలెన్సు వన్ లాక్ వున్నాయి. వెతకబోయిన తీగ కాళ్లకి తాకిందని ఫిక్స్ చేశాను. మెచ్చుకపోగా నాగ్ చేస్తున్నావు''.

''మరి రెండో పాయింటో? దాన్ని సమర్థించుకోరూ?''

''అదేమంత కష్టం గాదు. అడ్వాన్స్‌డ్ కంట్రీ నేత అనేవాడట. కావాల్సింది అందకపోతే తల నెప్పీ చికాకూ అటాక్ చేస్తాయి. డ్యూటీ చేయలేను'' ఆయన యందభిమానముగల ప్రజలేమో ''అదొక పెద్ద తప్పా? కూలర్స్‌ని అందిస్తే రిలాక్స్ అయి, పాలన తిన్నగా చేస్తాడు. కూచునీ కూచునీ వళ్లు వేడెక్కుతుంది అని సింపతీ చూపించేవారట. ఒక నేత కూలర్ ప్రొడ్యూసరైందిట గూడాను. అదీ నేరంగాదట. ఆయనేమీ దాచలేదుట. సెకండ్ టరమ్‌గూడా బరిలో దిగి గెల్చి మంచి పాలన చేశాడుట. అది ఆనెస్టీ అన్నారు ప్రజలు. నీవు స్క్రిప్ట్సు చదువుతావే వాటిలోని పరాశరుడు, ఫిలాసపర్, ఎడ్యుకేషనిస్టు, గాడ్‌మాన్, గాడ్‌ని గురించి చెప్పగలడు, అర్థం చేసుకున్నవారిలో మొదటివాడు. విద్యావ్యాప్తి చేస్తూ అహింస ప్రాపగేట్ చేస్తూ ఒక దీవి మీది కెళ్లినప్పుడు, ఒక ఫిషర్‌వుమన్ యవ్వనంలో వున్నామె బాగా పుష్టిగా హెల్దీగా వున్నామె కంటబడితే, హీ కాంట్ కంట్రోల్ హిజ్ పాషన్స్. ఆమె నవ్వుతూ బెస్తామెను, నీచు వాసన రాదా రోత పుట్టదా అని సింపుల్‌గా అబ్జెక్షన్ చెప్పింది. ''నేను నిన్ను జాస్మిన్‌గా మారుస్తాను. మనసు కలిగాక, కోరిక తీరకపోతే, యెక్కడికి పోయినా నువే కనిపిస్తావు. యేపనిమీదా మనసు నిలవదు'' అని నచ్చచెప్పి అలా, పారిజాత పూల వాసనలాగా, సంపెంగ వాసనలాగా దూరానికి సెంట్ వాసనలు విరజిమ్మే దాన్నిగానూ మార్చి తన కోరిక తీర్చుకున్నాడు. ద్వీపంలో పుట్టిన అబ్బాయిని ద్వైపాయనా అన్నార్ట. ఆమె ఒంటి నించి విడుదలైన సువాసనలచే మరొక రిచ్‌మేన్ ఆకర్షింపబడి వచ్చి, తనకడ్డేవారు లేరు గనక ఆమెను తీసికెళ్లి పెళ్లాడి స్టేటస్ గౌరవం

యిచ్చాడు. వాళ్లను మెచ్చినప్పుడు నువ్వు నన్ను మెచ్చాలి'' అన్నాడు విట్టీగా.

''బ్యూటీ, వయసు, జాబూ వున్న పర్సనాలిటీ కంటబడగానే దానిని వెంటేసుకు తిరుగుతూ, చీకట్లో షికార్లు కొట్టనిదీ వుండలేరు. అట్టి మనస్తత్త్వం గలిగి వుండీ, అట్టి పర్సనాలిటీనే తెచ్చుకుని స్థిరపడచ్చునే. నేను తారసిల్లిన సమయంలో నాకు రెండువేపులా మేనకా వూర్వశీ వున్నారే? మీక్కావాల్సిన ప్లస్ పాయింట్సు వారి కుండటమేగాక, వారు మీమీద బాగా ఆశలు పెంచుకున్నారు. ఇపుడు కంటిమెరమెరకు, మనసు పెరపెరలకు లోనౌతున్నారు''.

'ఫూల్. నా కందమక్కర్లేదనీ, అదే ప్లస్ పాయింటనీ డిడక్ట్ చేయాలి. మేనకా వూర్వశీ మూడు ముళ్లూ వేయనిదీ ముట్టుకో వద్దన్నారు. గడుసుదనం. అవి వేస్తే చాలా హక్కులివ్వాలి వారికి''.

''అదేం జవాబు. 'నాకందమక్కర్లేదు' అంటే నేను అందంగా లేనని క్లియర్ చేసినట్లే'' అని మూతి ముడిచింది.

''నీకు పెడర్థం తీయటం వచ్చు. అలా అర్థమొస్తుందని నాకు తెలియదు'' అని వెళ్లిపోయాడు హీరో.

''అదీ స్క్రిప్ట్సులో కథ'' అన్నది సరోజిని.

'' ఇంటరెస్టింగా భావగర్భితంగా వున్నది స్క్రిప్టు రోజమ్మా. సత్యం గూడా దాగి వున్నది. పోతున్నా వంటచేయాలి'' అని వెళ్లిపోయింది కళ్యాణి.